సాక్షి
కుమురం భీం

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



ఖైరీలో భారీ అగ్ని ప్రమాదం
కెరమెరి మండలం ఖైరీ గ్రామంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నలుగురి ఇళ్లలోని పత్తి, బంగారం, నగదు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతై తీవ్ర నష్టం వాటిల్లింది. 8లో▸



వార్షికోత్సవానికి ముస్తాబు
కౌటాలలోని సదాశివపేట శివాలయం 50వ వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఆదివారం నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. 9లో▸



వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అక్షింతలతో శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సిర్పూర్(టి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అయోధ్య రామాలయం అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తులకు అక్షింతలు అందజేశారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

తిరుమలలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుతో కలిసి సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రసిద్ధి గాంచిన వాయు లింగేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



క్రిస్టియన్లకు ప్యాక్‌లు ఇస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎన్ గార్డెన్స్‌లో క్రిస్టియన్లకు పండుగ కానుకగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పండుగను ఆనందోత్సాహాల మధ్య సోదర భావంతో జరుపుకోవాలని సూచించారు. ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు.


ప్రవేశాలకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ అనిత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనిత సూచించారు. శనివారం పాఠశాల ఆవరణలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22నుంచి జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ అర్హత పరీక్ష ఉంటుందని వివరించారు.

కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలి



క్లాత్‌బ్యాగులు పంపిణీ చేస్తున్న ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్: కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జాతీయ హరితదళం కాలుష్య మండలి ఆధ్వర్యంలో క్లాత్‌బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో క్యాన్సర్ లాంటి రోగాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్‌బ్యాగ్ వెంట తీసుకువెళ్తే చాలావరకు ప్లాస్టిక్ ఉపయోగం తగ్గించవచ్చని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణపై అవగాహన కోసం పాఠశాలల గోడలపై బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. హరితదళం కోఆర్డినేటర్ మధుకర్, ఎస్వో అబిన్‌అలీ, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

మరో చాన్స్

- ట్రాఫిక్ చలాన్లపై బంపర్ ఆఫర్
- 26నుంచి జనవరి 10వరకు గడువు
- జిల్లాలో రూ.5.94కోట్ల బకాయిలు
- టూవీలర్స్‌పై 50శాతం డిస్కౌంట్
- ఇతర భారీ వాహనాలపై 50 శాతం
- ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90..



ఆసిఫాబాద్: గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. కొత్త సంవత్సరంలో వాహనాల పెండింగ్ చలాన్లను క్లియర్ చేసేందుకు భారీ రాయితీ ప్రకటించింది. గతేడాది కూడా వాహనదారులకు పెండింగ్ చలాన్లు చెల్లించే అవకాశం కల్పించగా ఇంకా పెండింగ్‌లో చాలా ఉన్నాయి. ఇటీవల రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్ ఈ నెల 26నుంచి జనవరి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చలాన్లు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. పెండింగ్ చలాన్లకు భారీ డిస్కౌంట్ ఆఫర్ ఇవ్వగా పోలీస్‌శాఖకు కూడా ఆదాయం సమకూరనుంది. జిల్లాలో నిత్యం పోలీస్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి తరచూ జరిమానాలు విధిస్తున్నారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, వాహన పత్రాలు లేని వారికి జరిమానా వేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో వాహనానికి రూ.వేలల్లో జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయి. అడపాదడప పోలీసులు తనిఖీలు నిర్వహించినప్పుడు కొందరు పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నా ఇంకా జిల్లాలో రూ.కోట్లలో బకాయిలున్నాయి. ఆటోమేటిక్ కెమెరాలతో పాటు చౌరస్తాల్లో సిగ్నల్ జంపింగ్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు పోలీసులు ఈ చలానా జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుడికి అప్పటికప్పుడే జరిమానా మెసేజ్ వస్తుంది. చాలామంది వాహనదారులు తమకు ఈ చలాన్లున్నట్లు తెలిసినా అవి చెల్లించడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 26నుంచి జనవరి 10వ తేదీ వరకు ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో ఈ చలాన్లు చెల్లించేలా పోలీస్‌శాఖ సన్నాహాలు చేస్తోంది.

సర్కార్ రాయితీ ఇలా..
ద్విచక్ర వాహనాలు, ఆటోల చలాన్లపై 80 శాతం రాయితీ, కార్లు, ట్రక్కులు, భారీ వాహనాలపై 60 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం రాయితీని సర్కార్ ప్రకటించింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా పోలీస్‌శాఖ పెండింగ్ చలాన్ల స్వీకరణకు సిద్ధమవుతోంది. వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు htpps:// echallan. tlpolice. gov. in/ publicview1 లింక్‌ను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో 4,47,954 కేసులు..
గత నాలుగేళ్లలో జిల్లాలో 4,47,954 కేసులు నమోదు కాగా, రూ.12,06,09,610 జరిమానా విధించారు. వీటిలో 2,12,328 మంది రూ.3,86,22,175 చెల్లించగా, 2,35,626 మంది రూ.5,94,89,830 బకాయిలు చెల్లించాల్సి ఉంది. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో పోలీసులు భారీగా జరిమానా విధించారు. వారు పంపిన చలాన్లకు వాహనదారులు అంతగా స్పందించడం లేదు. దీంతో పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. పోలీసు తనిఖీల్లో ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాలో 82,900 కేసులు నమోదు చేశారు. 51,631 వాహనపత్రాలు లేనివి, 29,627 హెల్మెట్‌లేనివి, 61,933 ద్విచక్ర వాహనాలు, 6,134 ఆటోలు, 10,096 కార్లు, 3,960 లారీలు, 754 ట్రక్కులకు చలాన్లు విధించారు. పోలీసు తనిఖీల్లో కొంతమంది బకాయిలు చెల్లిస్తున్నప్పటికీ ఇంకా చాలామంది చెల్లించాల్సి ఉంది. గతేడాది పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు 45రోజుల పాటు అవకాశం కల్పించగా, పలువురు చెల్లించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చింది. జరిమానాలపై కొందరు వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడం, మరికొందరు నిర్లక్ష్యం చేయడంతో ఈ చలాన్లు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం తాజా నిర్ణయంతో పోలీస్‌శాఖకు పెద్ద ఎత్తున నిధులు సమకూరే అవకాశాలున్నాయి.

జనవరి 2019 నుంచి డిసెంబర్ 23, 2023 వరకు జిల్లాలోని పెండింగ్ చలాన్ల వివరాలు

పోలీస్‌స్టేషన్	నమోదైన కేసులు	జరిమానా రూ.	చెల్లించినవారు	చెల్లించిన రూ.	పెండింగ్ కేసులు	పెండింగ్ రూ.
ఆసిఫాబాద్	57,932	2,06,59,640	27,452	64,63,595	30,480	98,74,040
వాంకిడి	36,726	82,38,115	15,187	26,99,500	21,539	46,37,175
కెరమెరి	20,496	43,83,615	8,943	14,14,175	11,553	25,00,815
జైనూర్	25,030	1,01,85,230	13,826	35,93,470	11,204	44,87,450
సిర్పూర్(యు)	14,792	31,54,450	8,898	12,28,090	5,894	12,79,060
లింగాపూర్	10,316	25,30,620	6,209	9,17,000	4,107	9,48,440
రెబ్బెన	41,096	88,57,910	20,861	31,94,700	20,235	45,64,580
తిర్యాణి	10,624	19,34,630	4,324	5,88,690	6,300	10,77,995
కాగజ్‌నగర్ రూరల్	21,868	49,25,350	11,314	19,41,700	10,554	19,98,865
ఈజ్‌గాం	16,222	28,67,280	6,160	84,210	10,062	17,04,430
దహెగాం	11,455	23,58,120	5,236	6,15,835	6,219	12,46,975
పెంచికల్‌పేట్	9,753	18,49,950	4,363	5,12,455	5,390	9,70,500
కౌటాల	19,812	42,73,165	8,825	11,62,655	10,987	24,58,055
సిర్పూర్(టి)	40,123	99,48,710	14,347	25,58,565	25,776	60,35,220
చింతలమానెపల్లి	14,593	32,26,730	6,175	8,70,410	8,418	18,07,775
బెజ్జూర్	13,051	25,65,730	5,683	6,51,025	7,368	15,54,895
కాగజ్‌నగర్‌టౌన్	84,065	2,86,50,366	4,425	93,69,100	39,450	1,23,43,560
మొత్తం	**4,47,954**	**12,06,09,610**	**2,12,328**	**3,86,22,175**	**2,35,626**	**5,94,89,830**

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. ద్విచక్రవాహనాలపై 80శాతం రాయితీ, ఫోర్ వీలర్స్, ఆటోలపై 60శాతం, లారీలు, ఇతర భారీ వాహనాలపై 50శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం రాయితీ కల్పించింది. ఈనెల 26నుంచి జనవరి 10వ తేదీ వరకు పెండింగ్ చలాన్ల చెల్లింపునకు గడువు ఉంది. జిల్లాలోని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– సురేశ్‌కుమార్, ఎస్పీ

వైకల్యాన్ని జయించి అభివృద్ధి చెందాలి

- జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి
- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం
- విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న సావిత్రి

ఆసిఫాబాద్‌అర్బన్: దివ్యాంగులు వైకల్యాన్ని జయించి అభివృద్ధి చెందాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా శిశు సంక్షేమశాఖ పాత కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు 10రోజుల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని భరోసా కల్పించారు. సమావేశాల్లో సమస్యలపై చర్చించుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను పొందేందుకు దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు దివ్యాంగులు పలు సమస్యలు ప్రస్తావించి ఆవేదన వ్యక్తంజేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంపై డీడబ్ల్యూ కార్యాలయ సిబ్బంది తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. అనర్హులకు మూడుచక్రాల సైకిల్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తమను గుర్తించడం లేదని, సదరం క్యాంపుల సమయంలో వైద్యులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో సదరం క్యాంపులు సరిగా నిర్వహించడం లేదని, సకాలంలో పెన్షన్లు అందక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తంజేశారు. ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు మంజూరయ్యే నిధుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయ్ బాబు, డీఆర్డీవో కార్యాలయ డీపీఎం అన్నాజీ, డీపీఎం యశోద, పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్ ఎఫ్ ఆర్వో రవి, జిల్లాలోని అన్ని మండలాల దివ్యాంగులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా ఉదయం 6గంటల నుంచి భక్తులు స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల నేశ్‌శర్మ, సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో మొదట స్వామివారికి అభిషేకం, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ఉత్సవ విగ్రహంతో పాటు వైకుంఠద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాదశి సందర్భంగా భక్తులు ఉదయాన్నే నదీస్నానాలు చేసి ఉపవాస దీక్షలు చేశారు.



వైకుంఠ ద్వార దర్శనంలో భక్తులు

భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. పట్టణంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అర్చకుడు శిరీశ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: నేటి యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కుమ్రంభీం భవనంలో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి యువతను ఉద్దేశించి మాట్లాడారు. వివేకానంద జయంతి సందర్భంగా యువజన ఉత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. యూత్ డే సందర్భంగా నిర్వహిస్తున్న జానపద సాంస్కృతిక, ఇతర పోటీలను ప్రారంభించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలతో నిరుపేద యువతలోని ప్రతిభ గుర్తించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు మాట్లాడుతూ.. యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతకు అన్ని రకాలుగా ప్రభుత్వం చేయూతనిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, డీవైఎస్వో రమాదేవి, ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణమూర్తి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, క్రీడా పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాకు ఉజ్వల భవిష్యత్

- బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్
- అంబరాన్నంటిన సింగరేణి ఆవిర్భావ వేడుకలు

రెబ్బెన(ఆసిఫాబాద్): కొత్త గనుల ఏర్పాటుతో బెల్లంపల్లి ఏరియాకు పూర్వవైభవం రావటంతో పాటు ఉజ్వల భవిష్యత్ ఉందని ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఆవిర్భావ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా జీఎం కార్యాలయంలో సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం భీమన్న స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను జీఎం, సేవా సమితి ఉపాధ్యక్షురాలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సింగరేణి తల్లి విగ్రహాన్ని జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఏరియా ఉత్పత్తిలో ముందు నడుస్తోందన్నారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని ఇప్పటివరకు 130 శాతానికి పైగా సాధించిందని పేర్కొన్నారు. మిగతా మూడు నెలల కాలాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాన్ని ముందుగానే సాధిస్తామని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో గోలేటి, మరో ఏడాది తర్వాత మాదారం ఓసీపీల ఏర్పాటుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే గోలేటి ఓసీపీ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతుల కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాల నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు రాగానే గోలేటి ఓసీపీలో ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గోలేటి, మాదారం ఓసీపీల ఏర్పాటుతో ఏరియాకు పూర్వవైభవం రావటం ఖాయమన్నారు. ఒక వైపు బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారిస్తూనే మరోవైపు ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీపడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తూ గని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులు, అధికారులు, యూనియన్ల సహకారంతో ఏరియాను మరింత వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్వోటూ జీఎం నరేందర్, సేవా సమితి ఉపాధ్యక్షురాలు నళినీనరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సీహెచ్‌పీ భీంరావ్ జాడే, డీవైసీఎంవో డాక్టర్ శౌరి, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ నవనీత, ఇన్‌చార్జి డీజీఎం సివిల్ రాజేంద్ర ప్రసాద్, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గోలేటి సీహెచ్‌పీ నమూనా స్టాల్‌ను పరిశీలిస్తున్న జీఎం రవిప్రసాద్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని శనివారం రాత్రి గోలేటిటౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీఎం రవి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ప్రముఖ సినీనటుడు నాజర్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా జీఎంతోపాటు నాజర్ కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. వేడుకలను పురస్కరించుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



సింగరేణి పతాకానికి వందనం చేస్తున్న జీఎం, అధికారులు, నాయకులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

విద్యార్థికి గాయాలు

దహెగాం: పాఠశాలలో ఆడుకుంటుండగా కిందపడడంతో విద్యార్థికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన దాగామా సాత్విక్ దహెగాంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఆడుకుంటుండగా కిందపడడంతో గాయాలయ్యాయి. పాఠశాల సిబ్బంది తల్లి దండ్రులకు సమాచారం అందించడంతో ముందుగా కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. విద్యార్థికి చేయి విరిగిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పంపుహౌజ్ సెక్యూరిటీ గార్డుల ధర్నా

కోటపల్లి(చెన్నూర్): దేవులవాడ ఎస్టీపీపీ పంపు హౌజ్‌లో మూడేళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న తమను ఆదుకోవాలని శనివారం పంపుహౌజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవులవాడ స్టేజ్ 1, 2, చెన్నూర్ పంపుహౌజ్ పనుల్లో భాగంగా పైపులైన్ కింద భూములు కోల్పోవడంతో పాటు రాత్రి పగలు కష్టపడి పంపుహౌజ్ ఆస్తులను కాపాడామన్నారు. ప్రస్తుతం పవర్‌ప్లాంట్ కంపెనీ తమను జైపూర్ పవర్‌ప్లాంట్‌లో పనిచేయమని వేధింపులకు గురిచేస్తోందని వాపోయారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా సింగరేణి యజమాన్యం ఆదుకోవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మధుకర్, ప్రశాంత్, రాజమల్లు, సందీప్, శేఖర్, సుమంత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి


ఎంపికైన సంతోశ్‌కుమార్

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వి.సంతోశ్‌కుమార్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అత్యపత్య జూనియర్ మెన్ కేటగిరి ఎంపిక పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి పుదుచేరిలో జరగనున్న పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు అత్యపత్య జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, జేవీపీ కమలాకర్, పీఈటీ రాజలింగు విద్యార్థిని అభినందించారు.

కవితా పోటీలకు ఆహ్వానం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ టి.మల్లారెడ్డి 'నేటి విద్యార్థులే రేపటి నైతిక (ఆదర్శ) సమాజం' అనే అంశంపై కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ఔత్సాహికులైన కవితా రచయితలు తమ కవితలను పోస్టుద్వారా, వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ఉత్తమ కవితలకు ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000, కన్సోలేషన్ బహుమతులు రూ.500 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే కవులు తమ కవితలను టి.మల్లారెడ్డి, ఇంటినంబర్ 12-747/1, రెడ్డి కాలనీ, సంత్యసాయి టెంపుల, మంచిర్యాల అడ్రస్‌కు లేదా 9948657937 వాట్సాప్ నంబర్‌కు జనవరి 31 లోగా పంపించాలని సూచించారు.

ఎన్నికల బిల్లులకు ఎదురుచూపు

- ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చు
- అడ్వాన్స్‌గా రూ.1500 చెల్లింపు


కోటపల్లి పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టెంట్ (ఫైల్)

చెన్నూర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 743 పోలింగ్ స్టేషన్‌లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వోల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం నిధులు వచ్చినప్పటికీ ఖర్చుల కింద అడ్వాన్స్‌గా రూ.15 వందలు చెల్లించారు. కానీ ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ఏర్పాట్లకు రూ.5 నుంచి 7 వేల వరకు ఖర్చు అయ్యింది. మిగతా వాటిని కార్యదర్శులు సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేశారు.

టెంట్లు, సిబ్బందికి భోజనం..

ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో టెంట్‌తో పాటు తాగునీరు, టేబుళ్లు, కుర్చీలు, విద్యుత్ సౌకర్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లతో పాటు ఎన్నికల సిబ్బందికి కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు సజావుగా జరిగాయి.

జిల్లాలో 810 పోలింగ్ స్టేషన్లు

జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలలో ఏడు మున్సిపాలిటీలు, 18 మండలాలు ఉన్నాయి. 18 మండలాల్లో 743 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను కార్యదర్శులకు అప్పగించారు. పోలింగ్ స్టేషన్‌లో టెంట్లతో పాటు, ఇతర సామగ్రి, సిబ్బందికి భోజనాల కోసం ఒక్కో పంచాయతీ కార్యదర్శి రూ.5 నుంచి రూ.7 వేలు ఖర్చు చేశారు. ఎన్నికలు జరిగి 20 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఖర్చులు రాలేదు. దీంతో కార్యదర్శులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

అడ్వాన్స్‌గా రూ.1500..

ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలింగ్, పోలీసు సిబ్బంది భోజనం కొరకు ఆర్వోలు రూ.1500 మాత్రమే అడ్వాన్స్‌గా చెల్లించారని కార్యదర్శులు పేర్కొన్నారు. టెంట్లు, కుర్చీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టేబుల్స్, ఏర్పాట్లకు సంబంధించిన డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదని కార్యదర్శులు వాపోతున్నారు. మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఎన్నికల నిర్వహణ ఖర్చు కింద అడ్వాన్స్‌గా రూ.1500 అందించినా బెల్లంపల్లి నియోజకవర్గంలో మాత్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని పలువురు కార్యదర్శులు తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక..

చెన్నూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 137 పోలింగ్ స్టేషన్లు, మూడు మున్సిపాలిటీలలో 90 పోలింగ్ స్టేషన్లు కలిపి మొత్తంగా 227 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.2 వేలు, చెన్నూర్ నియోజకవర్గంలోని ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.1500 చొప్పున ఇచ్చాం. ఇతర ఖర్చులు కూడా అయ్యాయని ఎంపీడీవోల ద్వారా నివేదికలు అందాయి. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదించాం. నిధులు వచ్చిన వెంటనే ఇతర బిల్లులు చెల్లిస్తాం.
– సిడాం దత్తు, ఆర్వో, చెన్నూర్

'ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి'


మాట్లాడుతున్న యూసుఫ్

మందమర్రిరూరల్(చెన్నూర్): కార్మిక హక్కులు కాపాడే ఏఐటీయూసీని ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ కోరారు. శనివారం ఏరియాలోని కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే రాజకీయ జోక్యంతో సంస్థను దోచుకుందని ఆరోపించారు. ఐఎన్టీయూసీకి ఓటేస్తే టీబీజీకేఎస్ మాదిరిగానే ప్రభుత్వ సహకారంతో దోచుకుంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఏరియా సంయుక్త కార్యదర్శి కంది శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, రాజేశం, సంపత్, మనోహర్, సాంబయ్య పాల్గొన్నారు.

చరిత్రాత్మక హక్కులు సాధించాం



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘంగా కార్మికులకు చరిత్రాత్మకమైన హక్కులు సాధించామని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్ అన్నారు. శనివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్నామన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల ఏది కోరినా కాదనకుండా ఇప్పించారన్నారు. తాము సాధించిన హక్కులే తిరిగి ఎన్నికల్లో గెలిపిస్తాయన్నారు. ఈ ఎన్నికల్లో యువ కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా విజ్ఞతతో టీబీజీకేఎస్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ యూనియన్లు గెలిస్తే సింగరేణిలో మరింత ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు. ఆ రెండు సంఘాల విధానాలు ఒక్కటేనన్నారు. సమావేశంలో ఆయా యూనియన్ నాయకులు బండి రమేశ్, జక్కుల రాజేశం, పానుగంటి సత్తయ్య, అశోక్, కరుణాకర్, గోపియా, మస్కాల రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడా మేలుకో..

- నీ హక్కుల గురించి తెలుసుకో
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



పాతమంచిర్యాల: తమ అవసరాల కోసం వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేసే వారిని వినియోగదారులు అంటారు. వస్తువుల వినియమంలో వినియోదారునిదే ముఖ్యపాత్ర. వినియోగదారులు ఎలక్ట్రానిక్ విధానం, టెలీషాపింగ్, ఆన్‌లైన్ షాపింగ్, డైరెక్టు సెల్లింగ్, మల్టీలెవల్ మార్కెటింగ్ పద్ధతుల ద్వారా వస్తువులను పొందుతారు. తాము కొనుగోలు చేసిన తర్వాత ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి, పరిహారం పొందడానికి ప్రభుత్వం వినియోగదారులకు హక్కులు కల్పించింది. 1986 డిసెంబర్ 24న వినియోగదారుల రక్షణ చట్టం భారత దేశంలో అమలులోకి తెచ్చింది. నాటి నుంచి డిసెంబర్ 24ను ప్రభుత్వం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్

ప్రభుత్వం కల్పించిన హక్కుల ద్వారా తాము కొనుగోలు చేసిన వస్తు, సేవలలో నాణ్యత లోపిస్తే అమ్మకం చేసిన వస్తువులు, సేవా సంస్థల నుంచి నష్ట పరిహారం కోరే హక్కు వినియోగదారులకు ఉంటుంది. వస్తుసేవల గురించి పూర్తి సమాచారాన్ని పొందే హక్కు, సమస్యలకు పరిష్కారం కోరే హక్కు ఉంటుంది. వినియోగదారుల వివాదాల పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్‌లు ఉన్నాయి. న్యాయవాది అవసరం లేకుండానే కమిషన్‌లో కేసు వేయవచ్చు. రూ.5 లక్షల వరకు వస్తువు లేదా సేవలకు ఎలాంటి కోర్టు రుసుం ఉండదు. కేసు నమోదైన 120 రోజుల్లో తీర్పు వెలువరిస్తారు. జిల్లా కమిషన్ ఇచ్చే తీర్పుతో సంతృప్తి చెందకపోతే రాష్ట్ర కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

కొనుగోలుకు రశీదు తప్పనిసరి

వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువులకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. నాణ్యత లోపిస్తే రశీదులు, ఇన్‌వాయిస్‌లు ఐడీల ద్వారానే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు (కేసు) చేసే వీలుంటుంది. జిల్లాలో వినియోగదారుల కమిషన్ లేకపోవడంతో పాత ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్‌లోని వినియోగదారుల కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. జిల్లా కోర్టులో కమిషన్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు మేలు జరిగే అవకాశం ఉంది. కమిషన్‌కు వెళ్ల లేనివారు రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా ఫిర్యాదులను జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుకోవచ్చు.

కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్


యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నేతలు

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యలపై తాము ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులు సాధించామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్, ఆర్కే 6 గనులపై జరిగిన గేట్ మీటింగ్‌లలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సంయుక్త కార్యదర్శి గొల్రె నర్సయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, గునిగంటి నర్సింగరావు, లక్ష్మణ్, రమేశ్, సదానందం, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం


నృత్యం చేస్తున్న చిన్నారులు


సింగరేణి జెండా ఆవిష్కరిస్తున్న జీఎం మనోహర్


జిల్లా కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ కార్మికులు

మందమర్రిరూరల్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని మందమర్రి ఏరియాలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో జీఎం మనోహర్ సింగరేణి జెండాను ఆవిష్కరించారు. అధికారులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ రంగంలో కూడా గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాలో 32 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యం కాగా ఇప్పటి వరకు 28 లక్షల టన్నులు సాధించామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు జీఎం చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

మంచిర్యాలటౌన్: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికులు బి.కృష్ణ, పి.జగ్గారావు, బోనగిరి రాజిరెడ్డి, ఎం.సత్యనారాయణ, జి.నారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, కోశాధికారి పూదరి నర్సయ్య, విజ్ఞేష్, బి.రాజిరెడ్డి, గోని తిరుపతి రావు, మహేందర్ రాజు, కే.రవీందర్‌రావు, రిక్కుల రాజిరెడ్డి, శ్రీనాథ్, మైసూర్ రాజు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో యువకార్మికులకు ప్రాధాన్యత

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఏఐటీయూసీలో యువ కార్మికులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీపై శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. క్యాడర్ స్కీంలు సరిగా అమలు చేసేలా, యువ కార్మికులకు కెరీర్ గ్రోత్ ఉండేలా చూస్తామన్నారు. స్వలాభం కోసం పాకులాడే సంఘాలను పక్కనబెట్టి కార్మికుల పక్షాన పోరాటాలు సాగించే ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా సంఘాలకు చెందిన పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఆంజనేయులు, ఇప్పకాయల లింగయ్య, హరిరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. పార్లమెంటు భారతీయ నాగరిక సురక్ష సన్హిత చట్టాన్ని ఆమోదించిందన్నారు. న్యాయవ్యవస్థలో చాల మార్పులు వస్తాయని, ప్రతిఒక్కరూ వాటి గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయ వ్యవస్థలో వచ్చిన మార్పులు, చట్టాలను న్యాయవాదులకు వివరించారు. అనంతరం క్రైస్తవ సోదరులతో కలి సి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్ రావు, బార్ అధ్యక్షులు కారుకూరి సురేందర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఖైరీలో భారీ అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగిళ్లు దగ్ధం
- కాలి బూడిదైన పత్తి, బంగారం
- భారీ ఆస్తి నష్టం


కాలిన పత్తిని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: మండలంలోని ఖైరీలో శనివారం విద్యుత్ మీటర్‌లో జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన నాలుగిళ్లు దగ్ధమయ్యాయి. మొహర్లే గిర్మాజికి చెందిన 30 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష నగదు, తులం బంగారం, మొహర్లే చంద్రయ్యకు చెందిన 20 క్వింటాళ్ల పత్తి, రూ.20 వేల నగదు, తులం బంగారం, మొహర్లే సోమయ్య, కమలామాయికి చెందిన ఇంటి సామగ్రి, ఇల్లు కాలిపోయాయి. ఘటన సమయంలో కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. అప్పటికే గ్రామస్తులు నీళ్ల పోసి మంటలను అదుపులోకి తీసుకరాగా రెండు గంటన్నర తర్వాత ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ తుర్పతబాయి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అధికారులతో మాట్లాడి పరిహారం అందిస్తామన్నారు. వారి వెంట సర్పంచ్ విజయలక్ష్మి, న్యానేశ్వర్, నాయకులు బాలాజి, సోము, శ్రీరాం, చందు, ధర్ము, సిరాజ్ ఉన్నారు.

'హెచ్‌ఎంఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి'

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

నస్పూర్: రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5, ఆర్కే 6, ఏరియా వర్క్‌షాప్‌ల లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో మాట్లాడారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ, సింగరేణి ప్రైవేటీకరణకు ఆజ్యం పోసిన ఏఐటీయూసీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు అశోక్, లక్ష్మణ్, క్రాంతి, నవీన్, సదానందం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు

తాండూర్: ఈ నెల 20 నుంచి 22 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్–14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో మండల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న ఎం.హర్షిత, కే.వెంకటేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్, పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఇంగ్లిష్ విభాగంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్ (ట్రాన్సషన్–1), ఇంగ్లిష్–1 ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 సాయంత్రం నాలుగు గంటల్లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'12న చలో పార్లమెంట్'

బెల్లంపల్లి: దేశంలోని అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పన కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 16 విద్యార్థి సంఘాలు చేపడుతున్న చలో పార్లమెంట్ కార్యక్రమంలో విద్యావేత్తలు, విద్యార్థులు, మేధావులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల పొలం బాట

నెన్నెల: ఆహారం ఉత్పత్తికి రైతులు పడే కష్టం, శ్రమను ప్రత్యక్షంగా చూసేందుకు నార్వాయిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఉపాధ్యాయులతో కలిసి పొలంబాట పట్టారు. తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీపట్టి ఆ గదులకే పరిమితం కావడంతో వ్యవసాయ జీవనం, తమ ప్రాంతంలో పండే పంటలను విద్యార్థులకు వివరించడానికి క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించామని పాఠశాల హెచ్‌ఎం కోడూరి శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయంపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు పొలంలో స్వయంగా నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతు దంపతులను సన్మానించారు. ఉపాధ్యాయులు భీంపుత్ర, శ్రీనివాస్, సదయ్య, స్నేహలత, విద్యార్థులు పాల్గొన్నారు.


పొలంలో వరి నాటు వేసే పనిలో విద్యార్థులు